26 నుంచి లైసెన్స్డ్ సర్వేయర్లకు శిక్షణ

ఖమ్మం కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): లైసెన్స్డ్ సర్వేయర్లకు 50 రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. నూతన ఆర్వోఆర్, భూ భారతి చట్టం ప్రకారం 5 వేల మంది లైసెన్స్డ్ సర్వేయర్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జిల్లా హెడ్ క్వార్టర్ లలో 50 రోజుల పాటు శిక్షణ అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎంపికైన ప్రైవేట్ లైసెన్స్డ్ సర్వేయర్లకు మే 26 నుంచి జూలై 26 వరకు 50 రోజుల పాటు ఇల్లెందు క్రాస్ రోడ్డులో ట్రైనింగ్ అండ్ టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ (టీ టీడీసీ)లో శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన గురుకులాల్లో కౌన్సెలింగ్ పూర్తి


కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

భద్రాచలం, మే17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ శనివారం పూర్తయ్యింది. ఐటీడీఏ పీవో బి.రాహుల్ కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ప్రవేశాల ప్రక్రియను పరిశీలించారు. మొత్తం 737 సీట్లకు వంద శాతం భర్తీ చేశామని పేర్కొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

- సింగరేణి చైర్మన్ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమష్టి కృషి జరపాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం ఆదేశించారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు 2.2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని, ఉత్పత్తి చేసిన బొగ్గును రవాణా చేయాలని కోరారు.

గుండెపోటుతో ఐటీసీ ఉద్యోగి మృతి

బూర్గంపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ఐటీసీ ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాలు ప్రకారం...మండల కేంద్రమైన బూర్గంపాడుకు చెందిన ఎండీ షంషుద్దీన్(42) సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం విధులకు హాజరైన అయన అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు అతనిని ఐటీసీ డిస్పెన్సరీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహనికి కార్మిక సంఘాల నాయకులు, పలు పార్టీల రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిత్రుడి జ్ఞాపకార్థం గత 17ఏళ్లుగా బూర్గంపాడు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూసఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటులో ఆయన కీలకంగా వ్యవహరించారని తెలుపుతూ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని తోటి కార్మికులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వడదెబ్బతో వృద్ధుడు..

తల్లాడ, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో శనివారం వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన తొర్లపాటి దాసు(80) మృతిచెందాడు. ఎండ తీవ్రతకు తాళలేక శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. ఇంటి వద్దే దాసు శనివారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో పశువుల మృత్యువాత

జూలూరుపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఐదు పశువులు మృతి చెందిన సంఘటన మండలంలోని సూరారం గ్రామంలో చోటు చే సుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరా ల ప్రకారం.. సూరారం గ్రామానికి చెం దిన రైతులు బానోత్ వెంకటేశ్వర్లు, ఉడతల వెంకన్న, మందెరికల రాములు, జూలూరి లక్ష్మి, తేజవత్ సూర్యలు శనివారం ఉదయాన్నే తమ పశువులను మేత కోసం వదిలారు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఓ పొలంలో విద్యుత్ స్తంభం పడిపోవడంతో విద్యుత్ తీగలు కిందపడి ఉన్నాయి. దీంతో పశువులు ఆ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెం దాయి. మృతి చెందిన వాటిలో మూడు దుక్కిటెద్దులు, రెండు ఆవులు ఉన్నా యి. వీటి విలువ రూ.3లక్షలు ఉంటాయని రైతులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ట్రాన్స్‌కో మండల ఏఈ సతీష్ కుమార్ సందర్శించి మృతి చెందిన పశువులను పరిశీలించారు.


అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి


ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

అభివృద్ధిలో దూసుకు పోతున్నాం..

- తెలంగాణను అందుకునే శక్తి దేశంలో ఏ రాష్ట్రానికీ లేదు
- రాష్ట్ర ఎదుగుదల చూడలేక కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు
- వారికి అభివృద్ధితోనే సమాధానం చెబుతాం
- కాలువలు నిర్మించకపోతే 'సీతారామ'తో ఉపయోగం శూన్యం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- గోదావరి నదిపై నావిగేషన్ అధ్యయనం : మంత్రి తుమ్మల
- కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

కొత్తగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధిని అందుకునే శక్తి ఈ దేశంలో ఏ రాష్ట్రానికి లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కొత్తగూడెం నియోజకవర్గంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు, పాల్వంచలోని హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణాలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి ప్రసంగించారు.

పదేళ్లు ఫాంహౌస్‌లో పడుకుని ప్రజల సొమ్ము దుబారా చేసి ప్రస్తుతం రాష్ట్ర ఎదుగుదల చూడలేక అడ్డగోలుగా మాట్లాడేవారికి అభివృద్ధితోనే సమాధానం చెప్తామన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా అడవి నష్టపోకుండా ఇందిర సౌర, గిరి జల వికాసాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం కోసం రూ.12,500కోట్లు ఖర్చు పెట్టబోతున్నట్లు తెలిపారు. వచ్చే సోమవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటలో ఇందిరి గిరి జిల్లా వికాస పథకాన్ని సీఎం ప్రారంభించనున్నారని అన్నారు. 2023-24లో రాష్ట్రంలో 15వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా గత పాలకులు అదికూడా సక్రమంగా చేయలేకపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ఈ మార్చిలో 17,162మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చినప్పటికీ చిన్న అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశామన్నారు.

సీతారామ ప్రాజెక్టును ప్రాధాన్య ప్రాజెక్టుగా ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు. ప్రాజెక్టు కాల్వలకు కావాల్సిన భూసేకరణ చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టును నిర్మించి సాగునీటి కాల్వలు నిర్మించకపోవడంతో ఉపయోగం ఉండదని, బ్యారేజీలు, రిజర్వాయర్లు కట్టి వదిలేస్తే సముద్రంలో నీరు ఉన్నట్లే కానీ ఉపయోగం ఉండదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఢిల్లీలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు భట్టి తెలిపారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలను కలుపుతూ రీజనల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని, రీజనల్ రింగ్‌రోడ్డుకు ఔటర్‌రింగ్‌రోడ్డుకు మధ్య ఫార్మా, అగ్రకల్చర్, హౌసింగ్‌వంటి పలు రకాల క్లస్టర్లను నిర్మించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల పిల్లలకు ఉచితంగా ప్రపంచస్థాయి విద్యను అందించేందుకు యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని, మొదటి దశలోనే 14 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి టెండర్ల పక్రియ ప్రారంభించామన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శ్రీకారం చుట్టారు. కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరి మహిళా శక్తిక్యాంటిన్‌ను తనిఖీ చేశారు. అక్కడి మహిళలతో మాట్లాడి వ్యాపారం ఎలా ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్‌సబ్‌స్టేషన్ల ఉమ్మడి శిలాఫకాన్ని ఆవిష్కరించి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.18.17కోట్ల అంచనా వ్యయంతో కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయం, పాల్వంచలోని పాండురంగాపురం, శ్రీనివాస్‌నగర్‌కాలనీలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీల మూడు విద్యుత్ ఉపకేంద్రాలకు, కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సూపరింటెండెంట్, డివిజనల్ ఇంజనీరు కార్యాలయం, జిల్లా స్టోర్ కార్యాలయం, విద్యుత్ నియంత్రికల మరమ్మతుల కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాల్వంచలోని సోములగూడెం, కిన్నెరసాని ప్రాంతంలోని రోడ్లు, బ్రిడ్జిలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఎస్‌పీడీసీఎల్ సీఎండి కర్నాటి వరణ్‌రెడ్డి, సింగరేణి సీఎండి బలరాం, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నావిగేషన్‌పై అధ్యయనం: తుమ్మల



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధికి రోడ్లు, రైల్వే, ఎయిర్, జల, రవాణా వ్యవస్థలు అవసరమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. భద్రాద్రి రామాలయం అభివృద్ధికి రామాలయం చుట్టు జాతీయ రహదారులను ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగూడెం నుంచి కొతులాపూర్, కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వయా ఇల్లెందు రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. పోలవరం, సమ్మక్క సారక్క, అన్నారం, సుందేళ్ల, కాళేశ్వరం రిజర్వాయర్ పూర్తి అయ్యాయని అయా ప్రాంతాల్లో నావిగేషన్ అధ్యయనం చేపట్టి జల రవాణాకు ప్రణాళికలను చేపట్టాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కను మంత్రి తుమ్మల కోరారు. ఎయిర్‌పోర్టు కోసం గతంలో సూచించిన స్థలంలో కొన్ని కారణాల వల్ల అనుమతులు లభించలేదని ఎయిర్‌పోర్టు నిర్మాణం కొరకు త్వరలో మళ్లీ అధ్యయనం చేపడతామన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమ పరిధిలో పంట కాల్వల నిర్మాణానికి భూమి సేకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి ఆరు ఉపకేంద్రాలను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకుని శంకుస్థాపనలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

పత్తి తూకంలో మోసాలు

- వే బ్రిడ్జి రశీదుల్లో అసలు బరువు కంటే ఎక్కువ నమోదు
- రూ. 16లక్షల మోసానికి పాల్పడినట్టు గుర్తింపు


నిందితులను చూపుతున్న పోలీసులు

సుజాతనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): పత్తి తూకంలో అక్రమాలకు పాల్పడి కొనుగోలుదారులను మోసగించి లక్షలు దండుకున్న 26 మంది వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఈ సంఘటన పూర్వాపరాలు వెల్లడించారు. మండల పరిధిలోని మార్కెట్ యార్డ్‌లో జూలూరుపాడు మండలం పాలకొల్లు గ్రామానికి చెందిన కేశపూర్ణ వెంకట కృష్ణారావు, సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన మూడు బీమ్లా ఐదేళ్లుగా పత్తి వ్యాపారం చేస్తున్నారు. వీరు రైతుల వద్ద, చిరు వ్యాపారుల వద్ద పత్తి కొనుగోలు చేస్తుంటారు. విక్రయదారులు తమ పత్తిని యార్డులోని వేబ్రిడ్జి వద్ద తూకం వేయించి రశీదును వ్యాపారులకు చూపిస్తారు. దాని ప్రకారం వ్యాపారులు డబ్బులు చెల్లిస్తారు. గత 3 నెలలుగా వ్యాపారంలో నష్టాలు వస్తుండటంతో వారికి ఏమీ అర్థం కాలేదు. తాము చెల్లిస్తున్న డబ్బుకు, తమకు చేరుతున్న పత్తికి పొంతన ఉండటం లేదు. దీంతో వారికి వే బ్రిడ్జి నిర్వాహకులపై అనుమానాలు కలిగాయి.

మార్కెట్‌లో గుమస్తా అయిన భూక్యా అర్జున్, మార్కెట్‌యార్డులోని ప్రైవేటు వే బ్రిడ్జి ఆపరేటర్లు గోతం సతీష్, అక్కినపల్లి రాజేష్‌తో చేతులు కలిపి, పత్తి అసలు బరువు కంటే ఎక్కువగా ఉన్నట్టు వే బ్రిడ్జి బిల్ రశీదు తీసుకుని పత్తి విక్రయిస్తున్నారు. ఈ మోసాన్ని కాస్త ఆలస్యంగానైనా కొనుగోలుదారులు గుర్తించి ఈ నెల 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో ప్రైవేటు వే బ్రిడ్జి ఆపరేటర్లతో చిరువ్యాపారులు కుమ్మక్కైనట్టు తేలింది. ట్రాలీలో పత్తిని తీసుకువచ్చి తూకం వేసేటపుడు ట్రాలీ నుంచి డ్రైవర్ కిందకు దిగకపోవడంతో పాటు, మరో వ్యక్తిని ట్రాలీలోకి ఎక్కించి తూకం వేస్తున్నట్టు గుర్తించారు. ఇలా 268.95 క్వింటాళ్లను అదనంగా చూపించి రూ. 16 లక్షల 58 వేలు అక్రమంగా పొందినట్టు గుర్తించారు.

ఈ కేసులో 26 మంది నిందితులను అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ.13 లక్షల 18వేలు రికవరీ చేశామని డీఎస్పీ తెలిపారు. 18 ట్రాలీ ఆటోలు సీజ్ చేశామని, మరో ఇద్దరు నిందితులు (వే బ్రిడ్జి ఆపరేటర్లు) పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టయిన 26 మంది నిందితులను కోర్టులో హాజరు పరిచి, రికవరీ సొమ్మును కోర్టుకు అందించనున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం రికవరీ సొమ్ము కోర్టు ద్వారా బాధితులకు అందుతుందన్నారు. ఈ కేసును త్వరగా విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేసి, రికవరీ చేసిన ఎస్‌ఐ ఎం.రమాదేవిని, సీఐ ఆర్.వెంకటేశ్వర్లును, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నిందితుల వివరాలు..

సర్వారం గ్రామానికి చెందిన భూక్యా బాలు, దరావత్ గోపా, అజ్మీరా మోతీలాల్, భూక్యా దేవీలాల్, కేలోత్ రమేష్, కేలోత్ వీరు, బానోత్ వీరు, మాలోత్ సీతారాం, జర్పుల గణేష్, బానోత్ మోహన్, మాలోత్ మంగిలాల్, భూక్యా సంతోష్, బానోత్ ప్రేమ్, మాలోత్ రమేష్, మాలోత్ ప్రవీణ్ కుమార్, మాలోత్ లక్ష్మణ్, మాలోత్ సూర్యా, జర్పుల కుమార్, లావుడ్యా శ్రీనివాస్, బానోత్ బాబులాల్, బానోత్ శివ, బానోత్ కుమర్, బానోత్ రమేష్, బానోత్ బిక్కులాల్‌తో పాటు తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన మాగం వెంకటేష్, చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి తండాకు చెందిన భూక్యా అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



రీ వాల్యుయేషన్ రిజల్టు మరిచారు..!

- కాకతీయ విశ్వవిద్యాలయం అధికారుల తీరు
- ఫలితాలు ప్రకటించకుండానే మరో సెమిస్టర్ నిర్వహణ
- ఆందోళన చెందుతున్న డిగ్రీ విద్యార్థులు



ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 17(ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వహణ విభాగం లోపభూయిష్టంగా తయారయిందనే విమర్శలు వస్తున్నాయి. వర్సిటీ అధికారులు డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ అనంతరం పరీక్షల్లో ఫెయిలయిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో రీ వాల్యుయేషన్ కోసం ఫీజులు తీసుకున్నారు. అ యితే సదరు పరీక్షల ఫలితాలను మాత్రం వెల్లడించడాన్ని మాత్రం విస్మరించారు. దీంతో ఎంతో బాగా పరీక్ష రాశామని నమ్మకం ఉన్న విద్యార్థు లు రీవాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురు చూ సి, రాకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

ఇటీవల కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీకి సంబంధించి 1, 3, 5 సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలతో పాటే ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు రీ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించారు. దీంతో ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని వేల మంది విద్యార్థులు లక్షల రూపాయలను రీ వాల్యుయేషన్ కోసం చెల్లించారు. సాధారణంగా ఫీజులు చెల్లించిన తర్వాత కనీసం 45 రోజులలో ఫలితాలు వస్తాయని విద్యార్థులు చెబుతున్నారు. అయితే సమయం మించిపోతున్నా రీ వాల్యుయేషన్ ఫలితాలను మాత్రం పరీక్షల విభాగం అధికారులు వెలువరించలేదు. దీంతో విద్యార్థులు తమ పరీక్ష ఫీజులు ఎటు పోయాయని, దీనికి వర్సిటీ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

1, 3, 5 సెమిస్టర్ల రీ వాల్యుయేషన్‌కు సంబంధించిన ఫలితాలను పరీక్షల విభాగం ప్రకటించకముందే 2,4,6 సెమిస్టర్లతో పాటు బ్యాక్‌లాగ్ పరీక్షల కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే విద్యార్థులు రీ వాల్యుయేషన్‌లో ఫలితాలు చూసుకుని, అనంతరం పరీక్ష ఫీజులు చెల్లించాలని భావించా రు. రీ వాల్యుయేషన్‌లో పాస్ అయితే మరో సబ్జెక్టుకు దృష్టి సారించవచ్చని అనుకున్నారు. కాని అధికారులు మాత్రం రీ వాల్యుయేషన్ ఫలితాల ను విడుదల చేయకుండానే మరో సెమిస్టర్ పరీ క్ష ప్రకటన విడుదల చేసి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల్లోనూ గందరగోళమే..

డిగ్రీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షల నిర్వహణకు సంబంధించి గత వారంలో పరీక్షా కేంద్రాల విషయంలో గందరగోళంగా వివరాలు ప్రకటించారు. మొదట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మాత్రమే పరీక్ష కేంద్రాలు ఉంటాయని, ఆ తర్వాత అన్ని డిగ్రీ కళాశాలలకు సెల్ఫ్ సెంటర్లు ఇచ్చామని, అనంతరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి గందరగోళంగా వ్యవహరించారు. ఒక కాలేజీ విద్యార్థులను మరో కాలేజీలో పరీక్ష రాయాలని సూచించారు. మొదట జారీ చేసిన హాల్ టికెట్లలో ఉన్న పరీక్షా కేంద్రాలకు, ఆ తరువాత ప్రకటించిన కేంద్రాల్లో మార్పులు ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు.

చివరకు రేపు పరీక్షలు అనగా ముందు రోజు రాత్రి 10 గంటల తర్వాత హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో పెట్టారు. ఇటు పరీక్షలు నిర్వాహణలోను, రీ వాల్యుయేషన్ ఫలితాలు వెల్లడించడంలోనూ పరీక్షల నిర్వహణ యంత్రాంగం విఫలమైందని విద్యార్థులు విమర్శిస్తున్నారు.

తవ్వకాల్లో బయటపడ్డ బుద్ధ విగ్రహం



చింతకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు నిర్వహిస్తుండగా కూలీల తవ్వకాలలో ఓ పురాతన బుద్ధ విగ్రహం లభ్యమైన ఘటన మండలంలోని నాగులవంచ గ్రామం లో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కొల్లేటి నాగేశ్వరరావు వ్యవసాయ భూమిలో శనివారం ఉపాధిహామీ పనుల్లో భాగంగా భూమి చదును చేస్తున్న కూలీలకు పాలరాతి బుద్ధ విగ్రహం తగలడంతో జాగ్రత్తగా తవ్వి బయటకు తీశారు. ఇదే ప్రాంతంలో అనేక పురాతన ఇటుకలు, కుండలు కూడా లభ్యమైనట్లు రైతు తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు పరిశోధనలు నిర్వహిస్తే చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు లభ్యమయ్యే అవకాశం ఉంటుందని గ్రామస్థులు కోరుతున్నారు.

దేశ అభివృద్ధికి పాలకులు కావాలి


విద్యార్థులకు లాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం గాంధీ చౌక్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మన భవిష్యత్తు పౌరులు మాత్రమే కాక, దేశ అభివృద్ధికి పాలకులు కావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని అవకాశాల్లో ముందంజలో ఉండగలరని, ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు చాలా దోహదపడతాయని పేర్కొన్నారు. శ్రీమిత్రా ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మొత్తం రూ.3లక్షల విలువైన బహుమతులు, ఢిల్లీ యాత్ర అవకాశాలు విద్యార్థులకు లభించాయని తెలిపారు. ఖమ్మం జిల్లా విద్యాధికారి, మిత్ర గ్రూప్ డైరెక్టర్లు రంగా శ్రీనివాస్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్,చెరుకూరి యుగేందర్, నాగసాయిగ్యాస్ నాగేష్, ప్రసేన్, ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ బాధ్యులు బయ్యన్న, బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరావు, పసుమార్తి రంగారావు, వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు పచావ వెన్నెల(ఖమ్మం రూరల్ జలగంనగర్ ఉన్నత పాఠశాల), మా ఘం యశ్వంత్(మధిర ఉన్నత పాఠశాల), చింతోజు సాయి(మధిర ఉన్నత పాఠశాల), తిరుమలదాసు(రెబ్బవరం ఉన్నత పాఠశాల), రామిశెట్టి ఉమా(ఖాజీపుర ఉన్నత పాఠశాల), ఆవుల శ్రీమన్య(మేడపల్లి ఉన్నత పాఠశాల), గోడ లక్ష్మి(అడసర్లపాడు ఉన్నత పాఠశాల), పుచ్చకాయల భవ్య(అడసర్లపాడు ఉన్నత పాఠశాల), చందా భావన(బల్లేపల్లి ఉన్నత పాఠశాల) విద్యార్థులు ఉన్నారు.

విజేతకు న్యాయాధికారి అభినందన


వంశీని అభినందిస్తున్న న్యాయాధికారి శివనాయక్

భద్రాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన క్రీడాకారుడు మోడెం వంశీని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ అభినందించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి దేశం ఖ్యాతిని ఇనుమడింపజేసిన వంశీ ఏజెన్సీ వారు కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ స్టైల్ జిమ్ కోచ్ రామిరెడ్డి, వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు రావి రామ్మోహన్‌రావు, పామరాజు తిరుమలరావు, సాధనపల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసగించిన వ్యక్తిపై కేసు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ. లక్షలు తీసుకొని పలువురిని మోసగించిన వ్యక్తిపై ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మహ్మద్ మున్వర్ అలీ అనే వ్యక్తి ఖమ్మం సారధీనగర్‌లో గత కొన్నేళ్లుగా భార్యతో కలిసి నివసిస్తూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తనకు ఎందరో పెద్దలతో పరిచయం ఉందని, వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి అతను 2023 డిసెంబరులో పలువురి వద్ద నుంచి రూ. 19 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకపోగా గత ఆరు నెలలుగా మున్వర్ అలీ కనిపించకుండా పోయాడు. దీనిపై కవిరాజ్‌నగర్‌కు చెందిన బాధితురాలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఆంధ్రజ్యోతి BHADRADRI KOTTAGUDEM ZONE
ఆదివారం 18 మే 2025

భద్రాద్రి కొత్తగూడెం

● కొత్తగూడెం ● భద్రాచలం ● పినపాక ● అశ్వారావుపేట ● ఇల్లెందు

భగీరథ తాగునీటి ఇబ్బందులు

దుమ్ముగూడెం మే 17 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మండల వ్యాప్తంగా పలు గ్రామపంచాయతీల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 8 నుంచి 15 వరకు పర్ణశాల ఇంటేక్‌వెల్ వద్ద పూడికతీత పనుల సందర్భంగా రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తామని భగీరథ అధికారులు ప్రకటించారు. రెండురోజులకోసారైనా ట్యాంకులు పూర్తిస్థాయిలో నింపకపోవడంతో పలు చోట్ల అరకొరగా సరఫరా అవుతోంది. రెండురోజులకోసారైనా సరఫరా చేయడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ ఉపేంద్రను వివరణ కోరగా సిల్ట్ తీసే ప్రక్రియ కొంత ఆలస్యమైందన్నారు. పనులు పూర్తయ్యాయని 18 నుంచి నీటిసరఫరాలో ఇబ్బందులుండవన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషిచేయండి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషిచేయాలని, కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. శనివారం కొత్తగూడెంలోని కలెక్టర్ కార్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం జిల్లాను అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటుగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కొత్తగూడెంకు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తుమ్మలతోపాటు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మిగిలిన పలు సమస్యలను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు.

జేకే ఓసీకి పర్యావరణ అనుమతులు



ఓసీ ప్రతిపాదిత ప్రాంతం

ఇల్లెందు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియాలో మరో నూతన ఓసీ ఏర్పాటు కోసం రంగం సిద్ధమైంది. గత కొంతకాలంగా సింగరేణి అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. సింగరేణి జేకేఓసీ (రొంపేడు)ని ఏర్పాటుచేసేందుకు ఫేస్-2 పర్యావరణ అనుమతులు లభించాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పర్యావరణశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. ఇల్లెందు ఏరియాలో ప్రస్తుతం నడుస్తున్న జేకే5 ఓసీలో బొగ్గు నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఓసీ విస్తరణలో భాగంగానే రొంపేడు, కూసవల్లి ప్రాంతాలను కలుపుతూ నూతన ఓసీ ఏర్పాటు కోసం సింగరేణి అధికారులు గత మూడు సంవత్సరాల క్రితం ప్రతిపాదనలు సిద్ధంచేసి పర్యావరణ అనుమతుల కోసం చేసిన ప్రయత్నాలు ఫలించడంతో జేకేఓసీ ఏర్పాటుకు మార్గం సుగుమమైంది. ఈ ఓసీ సుమారు 15 నుంచి 20 సంవత్సరాల కాలం పాటుబొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. సంవత్సరానికి 2.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా తగిన ప్రణాళికలు రూపొందించిన యాజమాన్యం ఓబీ వెలికి తీసేందుకు టెండర్లను సైతం పూర్తి చేసినట్లుగా సింగరేణి అధికారులు ప్రకటించారు. ఏరియాలో బొగ్గుగనులు పుట్టినప్పటికీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో నూతన ఓసీ ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు రావడం పట్ల కార్మికులు, కార్మికసంఘాలు హర్షం వెలిబుచ్చాయి.

మోదీ, నితీష్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శనివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీహార్‌లోని దర్భాంగాలో రాహుల్‌గాంధీ పర్యటనను అడ్డుకొని రాహుల్ గాంధీపై కేసు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం హేయమైన చర్యన్నారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ అంటే ఎందుకు మీకు అంత భయం, మీరు ఎన్ని కేసులు పెట్టినా ప్రజలపక్షాన నిలబడే ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడారి ప్రదీప్, సుధీర్‌కుమార్, చింతిరాల అరుణ్‌రాజ్, సిద్ది ప్రవీణ్, జితేంద్ర, అనిల్, భార్గవ్, రేవంత్, సాయిరాం పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర



జాతరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, మే17 (ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండల పరిధిలోని చుంచుపల్లి తండా పంచాయతీలో పెద్దమ్మతల్లి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు సంవత్సరాలకు ఒక సారి జరిగే ఈ జాతర సందర్భంగా పూజారులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పెద్దమ్మతల్లి జాతరలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖః సంతోషాలతో ఉండాలని, అమ్మవారి దయ అందరిపై ఉండాలని కోరారు.

అనంతరం జరిగిన పూజల్లో అడవి నుంచి పెద్దగుట్ట నుండి కర్రలను తీసుకొని రావడానికి గత రెండు రోజులుగా కమిటీ సభ్యులు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. తీసుకువచ్చి కర్రలతో గుడి చుట్టు మూడు ప్రదక్షణలు నిర్వహించి, ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆ కర్రలను కునులను నరికి ముక్కలు చేసి ఆదివారం ఉదయం తెల్లవారుజామున పూజా కార్యక్రమాల్లో ఉపయోగిస్తారు. ఈ జాతరలో యువకులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మేక పోతులు, కోళ్లను బలిచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

గత ప్రభుత్వం చేయలేని పనులు చేస్తున్నాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పాల్వంచ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చే యలేని పనులు ఇప్పుడు చేసి చూపిస్తున్నామని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని యానంబైలు, రాజాపురం, సోములగూడెం గ్రామాల్లో రూ.13.40కోట్లతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజల చిరకాల కోరిక నేటికి నె రవేరిందని చెప్పారున 12 ఏళ్ల క్రితం ఈ బ్రిడ్జి పనులు శంఖు స్థాపన చేసి వదిలిపెట్టారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టిం చుకోలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం రాగానే పెండింగ్‌లో ఉ న్న పనులన్నీ పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన వాళ్ల అబద్ధపు ప్రచారం చేస్తు న్నారని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొరకు ప్రత్యే క దృష్టి సారించి ప్రజల కోసం పని చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకం పేదవర్గాలకు చేరే విధంగా చేస్తున్నామని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ ఏజెన్సీ జిల్లాలోని ప్రజల కష్ట సుఖాలు తమకు పూ ర్తిగా తెలుసన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భట్టి, తుమ్మల

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఈ గ్రామాల మధ్య బ్రిడ్జిల నిర్మాణాలను గత పాలకులు పట్టించుకోలేదన్నారు. తాను ప్రత్యేక దృష్టి సారించి ఏడాదిలోనే పూర్తి చేయించినట్లు చెప్పారు. ఈ బ్రిడ్జిల వల్ల 40 గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యం కలిగిందన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రుల సహకారం ఉండాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభం

స్థలదాతను సన్మానించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని శివారు అటవీ గ్రామ పంచాయతీ అయిన బుగ్గ పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లాంఛనంగా శనివారం ప్రారంభించారు. ఎస్టీ ఎస్‌టీడీఎఫ్ గ్రాంట్ ద్వారా రూ.20 లక్షలతో ఈ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. అనంతరం ఇదే గ్రామ పంచాయతీ పరిధిలో రూ.ఆరు లక్షలతో చేపట్టబోయే పలు అభివృద్ధి పథకాలను ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుగ్గ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో స్థానిక పంచాయతీ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న పలు పథకాల వివరాలను ఆదివాసీ కుటుంబాలకు వివరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి స్థలాన్ని ఇచ్చిన స్థలదాత కుంజా పగడయ్యను ఎమ్మెల్యే పాయం శాలువలు పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి ప్రకాష్, మండల అభివృద్ధి అధికారి తేళ్లూరి శ్రీనివాసరావు, ఏపీవో పల్నాటి వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏఈ ప్రసాద్, పలు శాఖల అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తాటి భిక్షం, పి.నవీన్, సురేష్, పాల్వంచ రాములు, పంచాయతీ కార్యదర్శి, స్థానిక గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



స్థలదాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయం

పేదలకు స్థలాలు దక్కే వరకు పోరాడుదాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

చుంచుపల్లి, మే17(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని వెంకటేశ్వరకాలనీ పంచాయతీలో గల కొమరం భీం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ.. కొమరం భీం కాలనీ నుంచి చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొమరం భీం కాలనీలో గత ఏడు సంవత్సరాల నుంచి ఇల్లు లేని పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా వీరికి ఇళ్ల స్థలాలు మాత్రం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ కళావతికి ప్రజలు వ్యక్తిగత దరఖాస్తులు అందించారు.



మాట్లాడుతున్న మచ్చ వెంకటేశ్వర్లు

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, నాయకులు డి.వీరన్న, బాలకృష్ణ, రాములు, రఘు, రమ, సంధ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. శనివారం కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ ద్వార పలు విద్యుత్ సబ్‌స్టేషన్లకు పాల్వంచలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా గిరిజన ప్రాంతమైనప్పటికీ పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. జిల్లాలో అన్నిరకాల వసతులు ఉన్నాయని, మౌలిక సదుపాయాలు ఉన్నాయని, అపారమైనటువంటి ఖనిజ సంపద ఉందన్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. తప్పని సరిగా కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగి తీరుతుందన్నారు. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి

రుద్రంపూర్, (సింగరేణి) మే 17 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమిష్టి కృషి జరపాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజు కోరారు. ప్రతి వ్యక్తి 40 ఏళ్లు దాటిన తర్వాత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా సింగరేణి కార్మికులకు రక్తపోటుపై శనివారం రుద్రంపూర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వ్యాయం చేయడం ద్వార ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. వ్యక్తిగత జీవితంలో ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి లలిత, ఎస్‌వోటు జీఎం జీవీ. కోటిరెడ్డి, ఏరియా ఇంజనీరు సూర్యనారాయణ, డీజీఎం శివకేశవరావు, ఎన్విరాల్‌మెంట్ అధికారి తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ నుంచి తొలగించాలి

నేడు ఇల్లెందులో ఆదివాసీ గర్జన సభ, ర్యాలీ



ఆదివాసీ గ్రామాల్లో సభపై విస్తృత ప్రచారం

ఇల్లెందు, మే 17(ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఆదిమ తెగల ప్రజలను కాపాడాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లందు పట్టణంలో ర్యాలీ, సభ నిర్వహించేందుకు నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. సభకు భారీగా ఆదివాసీ గిరిజన ప్రజలను తరలించేందుకు నాయకులు ఏజెన్సీ ప్రాంతాల్లో గత వారం రోజులుగా ప్రచారాలు చేశారు. ఆర్టికల్ 342 ఆమోదం లేకుండా చట్టవిరుద్ధంగా లంబాడాలను ఎస్టీ జాబితాలో కొనసాగిస్తున్నారని, ఆదివాసీ విద్యా, ఉపాధి అవకాశాలు కొల్లగొడుతున్నాయని ఆరోపిస్తూ ఆధార్ సొసైటి, తుడుం దెబ్బ, ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘాలు ఆరోపిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా నిర్వహక కమిటి కన్వీనర్ జోగా రాంబ్రహ్మం శనివారం విలేకరులతో మాట్లాడుతు ఆదివాసీల అస్తిత్వం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో తాడోపేడో తేల్చుకుంటామన్నారు. తెలంగాణ నీళ్ల, నిధులు దొచుకున్న ఆంధ్రా వలస వాదులపై జరిపిన పోరాటం స్ఫూర్తిగా ఆదివాసీల మనుగడ కోసం ఉద్యమిస్తున్నట్టు తెలిపారు. మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాష్ట్రాల్లోని అగ్రవర్ణాలుగా గిరిజనేతరులుగా ఉన్న లంబాడాలను తెలంగాణకు వలస వచ్చి ఆదివాసీ రిజర్వేషన్లు, భూములు కొల్లగొడుతున్నారని, ధన వంతులుగా మారడంతో రాజకీయ అధికారాలు సైతం లంబాడాల గుప్పిట్లో కూరుకుపోయాయని వాపోయారు. ఆదివాసీ అస్తిత్వం కోసం మరో ఉద్యమం సిద్ధం అయినట్లు తెలిపారు. ఇల్లెందులో ఆదివారం సాయంత్రం ఆదివాసుల ర్యాలీ జరుగుతుందని, జేకే కాలనీ సింగరేణి కాలరీస్ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివాసీ గర్జన సభ జరుగుతుందని తెలిపారు. సభలో మాజీ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావు, ఆధార్ సొసైటీ జాతీయ కన్వీనర్ జేజే రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి రామస్వామి తదితర జిల్లా నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కిన్నెరసానిలో 29నుంచి ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణ



ఇల్లెందులో పర్యటించిన బెల్లయ్య నాయక్

ఇల్లెందు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణా కార్యక్రమాలు ఈ నెల 29 నుంచి 31 వరకు పాల్వంచ సమీపంలోని కిన్నెరసానిలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) ఛైర్మన్ తేజావత్ బెల్లయ నాయక్ తెలిపారు. కిన్నెరసాని శిక్షణా కార్యక్రమాల కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణ ఏర్పాట్లపై తగిన సూచనలు ఇచ్చి వెళుతూ ఆయన శుక్రవారం రాత్రి ఇల్లెందులో విలేఖర్లతో మాట్లా డారు. 29న ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణా కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని, అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొడెం వీరయ్య పా ల్గొంటారని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు కొప్పుల రాజు హాజరవుతారని వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగ తులకు ఒక్కో మండలం నుంచి ఇద్దరు పురుషులు, ఒక మహిళా ప్రతినిధి హాజరు అవుతారని బెల్లయ్య నాయక్ తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

అశ్వారావుపేట, మే17(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగుకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. పి.శ్రీలత, డి.స్రవంతిలు కోరారు. నందిపాడు గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబించటం వల్ల రసాయనిక ఎరువులు ఎక్కువ వాడవలసిన అవసరం ఉండదని, తద్వార పంట ఖర్చు తగ్గించు కోవటంతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. పలు రాకల పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో ఏవో శివరామప్రసాదు, పశువైద్యులు స్వప్న, ఏఈవోలు రవీందరావు, సతీష్, కార్యదర్శి అలివేలు పాల్గొన్నారు.

డీలర్స్‌కు పంటలపై అవగాహన

అశ్వారావుపేట, మే17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 80 మంది డీలర్లు అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో క్షేత్ర సందర్శన కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాస్త్రవేత్తలు డా.పి నీలిమ, ఎన్.చరిత పంటలపై డీలర్లకు అవగాహన కల్పించారు. క్షేత్ర ప్రదర్శన లో బాగంగా ఆయిల్‌ఫామ్, కొబ్బరి సాగు, ములగ అంతరపంటలు, సాగు యాజమాన్యపద్ధతులు, నీటియాజమాన్యం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం, అంశాలపై వివరించారు. కళాశాలలో నూతనంగా తయారు చేసిన ఫార్మింగ్ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాలలో ముఖ్యమైన జీవ నియంత్రణ ల్యాబ్, భూసార పరీక్ష, వర్మీకంపోస్టు యూనిట్లను సందర్శించారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు



ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన

కొత్తగూడెం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను పరిష్కరించేంత వరకు రాజీలేని పోరాటాలు చేస్తామని అఖిల భారత ఐక్యరైతు సంఘం కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెంలో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐయూకేఎస్ నాయకులు జాటోత్ కృష్ణ, కల్లూరి కిషోర్ మాట్లాడుతూ ఈ నెల 24, 25 తేదీల్లో దమ్మపేటలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలన్నారు. పోడుభూములు సాగు చేసుకుంటున్న రైతులకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మా, గోపాల్‌రావు, సతీష్, వీరభద్రం, నరేష్, సుశీల, లక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా ప్రకాశరావు

అశ్వాపురం, మే17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా అశ్వాపురానికి చెందిన తుళ్లూరి ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు మండల పార్టీ సమావేశం శనివారం స్థానిక తుళ్లూరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర పరిశీలకుడు కొడాలి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కార్యకర్తల అభిప్రాయం మేరకు వరుసగా నాల్గోసారి ప్రకాశరావును మండల పార్టీ అధ్యక్షునిగా ఎంపిక చేశారు. మండలంలో పార్టీబలోపేతానికి తనశాయశక్తుల కృషిచేస్తానని ప్రకాశరావు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు పోటు రంగారావు, వట్టం నారయణదొర, జగదీశ్వర్ రావు, అశ్వాపురం మాజీ ఎంపీటీసి తుళ్లూరి గంగాభవాని, నాయకులు వాసు, భాస్కర్‌రావు,సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను పరిశీలించిన రేగా

మణుగూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని వంద పడకల ఆసుపత్రిని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం సందర్శించారు. అందుతున్న వైద్య సేవలపై రోగులనడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు అందజేస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతులను పరిశీలించారు. వైద్య సేవలు పొందుతున్న కూనవరం మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు వల్లభనేని రమణ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, ఏనిక ప్రసాద్, మడి వీరన్న బాబు, జావెద్ పాష, తదితరులు పాల్గొన్నారు..

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

కరకగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీలలో (డీఎమ్ఎఫ్‌టీ) డిస్ట్రిక్ మైనింగ్ నిధుల నుంచి రూ.24 లక్షల మంజూరు అయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకృష్ణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని వెంకటాపురం, పద్మాపురం, భట్టుపల్లి, లక్ష్మీపురం, భర్లగూడెం గ్రామాలలోని వాటర్ ట్యాంకులకు నూతన మెట్లు ఏర్పాటు కోసం ఒక్కొక్క వాటర్ ట్యాంకుకు రూ, మూడు లక్షల చొప్పున ఆరు ట్యాంకులకు రూ.18 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. పద్మాపురం పంచాయతీ మొగిలితోగు గ్రామంలో గ్రిడ్ నీటి కోసం రూ.4లక్షలు, విప్పలగుంపు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పైపులైన్ మరమ్మత్తుల కోసం రూ.2లక్షలతో మొత్తం రూ.24 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

రామానుజవరంలో సింగరేణి వైద్య శిబిరం

మణుగూరుటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామానుజవరం గ్రామంలో శనివారం సింగరేణి సేవా సమితి. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 102 మంది ప్రజలను పరీక్షించారు.